www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 నవంబర్ 2024



పీజీ సెమిస్టర్ పరీక్షలు తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయ ఎంఎ, ఎంకాం, ఎంఎస్సి సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. విశ్వవిద్యాలయ ఆవరణలోని ఎపిజె అబ్దుల్ కలాం గ్రంథాలయంలో ప్రారంభమైన పరీక్షలను వైవియు విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.వి. కృష్ణారావు తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఆచార్య కాత్యాయని మాట్లాడుతూ పీజీ పరీక్షలకు 488 మంది హాజరైనట్లు తెలిపారు. పరీక్షలు డిసెంబరు 4 వరకు కొనసాగుతాయన్నారు. పరీక్షల నిర్వహణలో సూపరింటెండెంట్లు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, డాక్టర్ మనికుమారి, కడపలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు.

కాలేటివాగు పనులపై విచారణ

- రూ.2,200 కోట్ల చెల్లింపులపై నజర్
- శాసనసభలో ఇరిగేషన్ మంత్రి ప్రకటన
- ఇరిగేషన్ ఇంజినీర్లలో ఉలికిపాటు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి



జిల్లాలోని జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ (కాలేటివాగు) అనుసంధాన పనులపై విచారణ ఖాయమైంది. బుధవారం శాసనమండలిలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానంగా రాష్ట్ర నీటి పారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు విచారణ చేపట్టనున్నట్లు ప్రకటించారు. 2019 మార్చిలో రూ.5,0036 కోట్లతో జిఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. సుమారు రూ.2,200 కోట్ల మేర చేసిన బిల్లుల చెల్లింపుల అక్రమాలు చోటుచేసుకున్నాయనే ఆరోపణలపై విచారణ చేపట్టనుంది. ప్రభుత్వ ఆదాయాన్ని ఖజానాకు రాకుండానే మూడు కార్పొరేషన్ల ద్వారా దారిమళ్లించి భారీగా సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. జిల్లాలోని పులివెందుల నుంచి అన్నమయ్య, చిత్తూరు జిల్లా పరిధిలోని పుంగనూరు, కుప్పం వరకు 20 టిఎంసిలతో 2.91 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించాలనే ఉద్దేశంతో అప్పటి వైసిపి సర్కారు ఎత్తిపోతల పనులు చేపట్టింది. జిల్లా జలవనరుల శాఖ నిర్వహించిన టెండర్ల దగ్గర నుంచి, కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులు, బిల్లుల చెల్లింపుల వగైరా వివరాలపై శూలశోధన చేయనుంది. 2020 మార్చి నుంచి 2023 మార్చి నాటికి కాంట్రాక్టు దక్కించుకున్న వైసిపి మంత్రి వర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించిన ఓ మంత్రికి సంబంధించిన పిఎల్ఆర్, నవయుగ కాంట్రాక్టు సంస్థలు పనులు పూర్తి చేయడంలో అలక్ష్యాన్ని పరిగణలోకి తీసుకోనుంది. ఏడాదిన్నరలో 0.2 టిఎంసిల నుంచి 1.2 టిఎంసిల సామర్థ్యం కలిగిన కాలేటివాగు ఎత్తిపోతల పథకం పనులపై దృష్టి సారించనుంది. 2020 మార్చి నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల నాటికి 22 శాతం మేర కాలేటివాగు పనుల్ని పూర్తి చేసింది. రూ.2,200 కోట్లు మేర బిల్లుల చెల్లింపులు చేసినట్లు సమాచారం. అధిక భాగం పనుల్ని మట్టి పనులపై ఆరా తీయనుంది. ముదివేడు, కాలేటివాగు రిజర్వాయర్ల మట్టి పనుల చెల్లింపుల్లో అక్రమాలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కాంట్రాక్టు కంపెనీలకు చెల్లించిన సుమారు రూ.2,200 కోట్ల బిల్లుల చెల్లింపుల గోల్‌మాల్ వ్యవహారాన్ని పరిశీలించనుంది. ఇంజినీరింగ్ అధికారులు కాంట్రాక్టు సంస్థలకు వంతపాడి కోట్లాది రూపాయల బిల్లుల చెల్లింపులు అక్రమంగా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో విచారణకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. 2019 మార్చిలో జిఎన్ఎస్ఎన్, హెచ్ఎన్ఎస్ఎస్ పనుల అగ్రిమెంట్ కుదుర్చుకున్న సిఇలు, ఎస్ఇలు, ఇఇలు, డిఇలు, ఎఇలు ఉలికిపాటుకు గురికావడం గమనార్హం.

శ్మశాన వాటిక రోడ్డుపై చెత్తాచెదారం

- పట్టించుకోని సచివాలయ సిబ్బంది
- ఇబ్బందుల్లో స్థానికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

దేవుని కడప ప్రజలకు సంబంధించిన శ్మశాన వాటిక రోడ్డు చెత్తా చెదారంతో నిండిపోయింది. పందుల బెడద అధికమైంది. సచివాలయానికి కూతవేటు దూరంలో ఇలాంటి దుస్థితి కనిపిస్తూ ఉంటే పట్టించుకునే నాధుడే కరువయ్యారు. సచివాలయంలో పనిచేస్తున్న సంబంధిత సిబ్బంది అటువైపు తొంగి చూసిన పాపాన పోలేదు. ఎవరైనా చనిపోతే శవాన్ని శ్మశానికి తీసుకెళ్లే ముందు దింపుడు కళ్లెం చేయడం ఆనవాయితీ. ఎక్కడైతే ఈ తంతు నిర్వహించాలో అక్కడ చెత్త పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ చెత్త పరిధిలోనే కొంతమంది ఫాస్ట్‌ఫుడ్ వంటి తినుబండారాలను తయారు చేస్తూ ప్రజలు, పిల్లల అనారోగ్యానికి కారణం అవుతున్నారు. దీంతోపాటు పందులు స్వైర విహారం చేస్తూ ఉన్నాయి. స్థానికంగా నివసించేవారు ఈ దుర్గంధాన్ని భరించలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. సచివాలయంలో సంబంధిత విభాగ సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కార్మికుల చేత ప్రధాన రహదారి పనులు చేయించడం తప్ప మిగిలిన రహదారులను పట్టించుకోవడం లేదు. కార్పొరేషన్ అధికారులు స్పందించి చెత్తాచెదారాన్ని తొలగించి, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



శ్మశాన వాటికకు వెళ్లే దారిపై పేరుకుపోయిన చెత్తాచెదారం

చెత్తను వెంటనే తొలగించండి..



ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న చెత్తను తొలగించాలి, అనారోగ్య వాతావరణంలో నూడిల్, గోబీమంచూరియా వంటి తిను బండారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. దింపుడు కళ్లెం వద్ద చెత్తను తొలగించాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని కోరినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలి.

- అడవాల రాజా, దేవుని కడప.

కార్పొరేషన్ అధికారులు స్పందించాలి..



చెత్తాచెదారాన్ని రోడ్లపై వేస్తున్న వారిపై కార్పొరేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. సచివాలయ సిబ్బంది సరిగా స్పందిస్తే ఇలాంటి అపరిశుభ్రత రోడ్లపై కనిపించదు. ఉన్నతాధికారులు సరిగా పనిచేయని వారిపై దృష్టి సాధించాలి. పని చయించాలి. శ్మశాన వాటిక రోడ్డులో చెత్తను తొలగించి దింపుడు కళ్లెం కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

-ప్రవీణ్ కుమార్, దేవుని కడప.

ఆర్‌టిసికి కార్గో ఆదాయం రూ.1.20 కోట్లు

ప్రజాశక్తి-పీలేరు

ప్రజా రవాణా సంస్థకు కార్గో నిర్వహణ ద్వారా అన్నమయ్య, కడప జిల్లాల్లో నెలవారీ రూ.1.20 కోట్లు ఆదాయం సమకూరుతోందని కార్గో అధికారి సి.జనార్ధన్ తెలిపారు. గురువారం ఆయన పీలేరులోని ఆర్టిసి కార్గో కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో నెలవారి కార్గో ఆదాయ లక్ష్యం రూ.58.80 లక్షలు కాగా ప్రస్తుతం రూ.45 లక్షలు ఆదాయం వస్తోందన్నారు. కడప జిల్లాలో కార్గో ఆదాయం రూ.1.53 కోట్లు లక్ష్యం కాగా ప్రస్తుతం నెలవారి రూ.75 లక్షలు మేరకు ఆదాయం సమకూరుతోందని తెలిపారు. కడప, ప్రొద్దుటూరు, మదనపల్లి ఆర్టిసి డిపోల్లోని కార్గో కేంద్రాలు అధిక ఆదాయంతో ప్రథమ స్థానంలో ఉన్నాయని చెప్పారు. మిగిలిన కార్గో కేంద్రాల్లోనూ ఆదాయాన్ని పెంచడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో కేంద్రాలతో పాటు అదనంగా ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ ప్రైవేటుగా కార్గో ఏజెంట్ల నియామకం జరిగిందని, వీరు బుక్ చేసిన పార్శిల్స్‌పై కమిషన్ ఇవ్వడం జరుగుతోందని పేర్కొన్నారు. కార్గోల ద్వారా నిషేధిత వస్తువులు, పదార్థాలు బుక్ చేసుకోవద్దని సూచించారు. ఆర్టీసీ కార్గో ద్వారా 45 గంటల్లో రాష్ట్రంలోని ఏ ప్రాంతానికైనా వస్తువులు చేరవేయడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ చంద్ర, పీలేరు ఆర్‌టిసి సిఐ సుబ్బమ్మ, ఏజెంట్ తిరుమలయ్య, సహాయకులు రోషన్, అహ్మద్ పాల్గొన్నారు.



పీలేరు కార్గో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అధికారి జనార్ధన్

ఆర్‌జివి, పోసాని, శ్రీరెడ్డి, శ్యామలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కడప అర్బన్



సిఐకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న ఐటిడిపి నగర ఇన్‌ఛార్జి

సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, హోం మంత్రి, అనిత, విద్యాశాఖ మంత్రి లోకేష్‌పై అసభ్యకర పోస్టింగులు, పదజాలాలు వాడిన సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ, నటుడు, దర్శకుడు పోసాని కృష్ణమురళి, నటి శ్రీరెడ్డి, యాంకర్ శ్యామలపై కడప వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఐటిడిపి కడప నగర ఇన్‌ఛార్జి బొమ్మిచెట్టి చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. గురువారం సిఐ రామకృష్ణకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం, డిప్యూటీ సిఎం, హోం మంత్రి, విద్యాశాఖ మంత్రి ఫొటోలు మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టాలని పేర్కొన్నారు. అసభ్యకర పదజాలం కూడా వాడారని తెలిపారు. ఇతర రాష్ట్రంలో తలదాచుకుంటున్న వారు ఆంధ్రప్రదేశ్ వైసిపితో చేతులు కలిపి విచ్ఛిన్నం చేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించి రాష్ట్రపతి పాలన వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వీరిని అరెస్టు చేసి జైలుకు పంపాలని కోరారు. వన్‌టౌన్ సిఐ రామకృష్ణ ఫిర్యాదుపై స్పందిస్తూ సినీ నటులపై ఫిర్యాదును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మహిళపై అత్యాచారం, హత్య

- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్‌పి, డిఎస్‌పి

ప్రజాశక్తి-కాశినాయన



మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి

మండల పరిధిలోని చెన్నవరం-పామిడిపల్లె వెళ్లే మార్గ మధ్యలో ఓ మహిళను గుర్తుతెలియని వ్యక్తులు అత్యాచారం చేసి ఆపై హత్య చేశారు. మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ వివరాల మేరకు.. చాపాడు మండలం ఖాదరపల్లె గ్రామానికి చెందిన కరీమున్నిషా (35) చెన్నవరం-పామిడిపల్లె గ్రామానికి వెళ్ల రహదారిపై పడి ఉంది. మేకలు, బర్రెల కాపలాదారులు ఆమె మృతదేహాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే పోరుమామిళ్ల సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి, కాశినాయన ఎస్ఐ హనుమంతు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహంపై ఎలాంటి దుస్తులు లేవు. ముఖాన్ని గుర్తు పట్టనంతగా బండరాయితో నుజ్జునుజ్జుగా కొట్టారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. ఆమె ఇక్కడికి ఎందుకు వచ్చిందని, ఎవరు చంపారనే వివరాలు నిందితులను పట్టుకున్నాక విచారణలో తెలియజేస్తామని డిఎస్‌పి పేర్కొన్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లా ఎస్‌పి విద్యాసాగర్‌నాయుడు ఆమె మృతదేహాన్ని పరిశీలించి ఆమెను ఎవరో హత్య చేసి ఉంటారని, అత్యాచారం విషయం పోస్టుమార్టం రిపోర్టులో తెలుస్తుందని పేర్కొన్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వివరాలు తెలుపుతామని ఆయన చెప్పారు. కాగా మృతురాలి భర్త నాసిర్ ఓ కేసులో జైలులో ఉన్నట్లు తెలిసింది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి- కడప అర్బన్ : రాష్ట్రంలో గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు తక్షణమే జమ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇతర ఉద్యోగులకు అందరికీ జీతాలు వచ్చాయని, కానీ గ్రంథాలయ సంస్థ ఉద్యోగాలకు రాలేదని పేర్కొన్నారు. ఇటీవల గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారని, ప్రభుత్వం జీవితాలు మాత్రం ఇంకా ఇవ్వలేదని వాపోయారు. ఎన్నికల సమయంలో ఒకటవ తేదీనే జీతాలు జమ చేస్తామని చెప్పారన్నారు. నిరుద్యోగ యువతకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. కానీ గ్రంథాలయ జీతాలు అందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు.

పులివెందులలో మెడికల్ సీట్ల భర్తీ చేజార్చారు

- హైకోర్టు బెంచ్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - కడపఅర్బన్



వైసిపి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన పులివెందుల మెడికల్ కళాశాలలో 50 ఎంబిబిఎస్ సీట్ల భర్తీకి అవకాశమున్నా టిడిపి ప్రభుత్వం చేజార్చడం బాధాకరమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి. రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం శాసనమండలిలో పలు అంశాలను ప్రస్తావించారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. గత ప్రభుత్వం జాతీయ న్యాయ కళాశాలకు స్థలం కేటాయించిందని, బడ్జెట్‌ల రూ. 1000 కోట్లు పెట్టిందని పేర్కొన్నారు. దానిని కూడా ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. వచ్చే ఏడాది 100 సీట్ల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2004లో కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల పెన్షన్ ఒపిఎస్ నుంచి సిపిఎస్‌కు మార్చిందని చెప్పారు. దీనిని ఉద్యోగులు వ్యతిరేకించారని వైసిపి ప్రభుత్వం జిపిఎస్ కొనసాగిస్తామని చెప్పిందన్నారు. ఒపిఎస్ కావాలని ఉద్యోగులు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. టిడిపి ప్రభుత్వం జిపిఎస్ కొనసాగిస్తుందా ఒపిఎస్ ప్రవేశ పెడుతుందా అని ప్రశ్నించారు. పులివెందుల మెడికల కళాశాలలో 50 ఎంబిబిఎస్ సీట్లు భర్తీకి అవకాశమున్న టిడిపి ప్రభుత్వం చేజార్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 50 సీట్లకు వసతులు కల్పించలేమని చేతులు ఎత్తేయడం భావ్యం కాదన్నారు. రిమార్క్స్ రాసి 50 సీట్లు కొనసాగించి ఉంటే బాగుండేది అన్నారు. 100 సీట్లు వచ్చే అవకాశం ఉండేదని పేర్కొన్నారు.

ఎఒ కార్యాలయాన్ని శుభ్రం చేయించాలి

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : కంప చెట్లతో నిండిన ఎఒ కార్యాలయాన్ని శుభ్రం చేయించి ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉంచాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. దస్తగిరిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు ఎఒ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల పక్కనే వ్యవసాయ కార్యాలయం ఉందన్నారు. ముళ్లకంపలతో నిండి ఉందని, చిన్నపాటి మరమ్మతులు చేయించడంలో మండల వ్యవసాయ శాఖ అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని వాపోయారు. రైతులు తమ సమస్యలపై తహశీల్దార్ కార్యాలయం, ఎఒ కార్యాలయాలకు వస్తుంటారని పేర్కొన్నారు. ఇప్పుడు అక్కడ గేటుకు బీగాలు వేసి ముళ్ళకంపలతో ఉందని, లక్షల ఖర్చు పెట్టి వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని నిర్మిస్తే మండల ఏవో లేకపోవడం చాలా బాధాకరమని చెప్పారు. అదే గ్రామంలో దూరంగా ఉన్న ఆర్‌బికెలో మండల వ్యసాయాధికారి ఉంటరని, దీంతో రైతులకు ఏవో ఎక్కడ ఉన్నారో అర్థం కాని పరిస్థితి నెలకొందని తెలిపారు. తక్షణమే మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో ముళ్ళకంపలు తొలగించి ఆఫీసులోనే ఏవో రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికాలా దృష్టికి ఏపీ రైతు సంఘం తీసుకుపోతుందన్నారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణయ్య, మండల రైతులు ఈశ్వర్‌రెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.

తెలుగు యువత జిల్లా కార్యదర్శిగా రాజా

ప్రజాశక్తి- కడప అర్బన్

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి తెలుగు యువత జిల్లా కార్యదర్శిగా అడవాల రాజాను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కమిటీ, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవి, దేవుని కడప టిడిపి నాయకులు ఎద్దుల శంకర్ కు రాజా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం మేలు

ప్రజాశక్తి -గోపవరం

ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని ఇఒపిఆర్‌డి హసీనా పేర్కొన్నారు. గురువారం మండలంలోని రాచాయపలే గ్రామ సచివాలయంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హసీనా, సుబ్బయ్య, విజయభాస్కర్ రెడ్డి పంటలకు ఆశించే తెగులు, నివారణ, సేంద్రీయ ఎరువులు వంటి వాటి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో రాచాయపేట రైతు పంచాయతీ పిస్ నిఖిత, మహిళ పోలీస్ మణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి - కడప



నిరసన తెలియజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

న్యాయవాదుల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతుందని, కేంద్ర ప్రభుత్వం తక్షణం స్పందించి అడ్వకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని, న్యాయ వాదుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కడప బార్ అసోసియేషన్ అధ్యక్షులు బొగ్గుల గుర్రప్ప నాయుడు కోరారు. తమిళనాడు రాష్ట్రంలోని హోసూరులో కోర్టు బయట న్యాయవాది కన్నన్ పై క్రూరంగా మారణాయుధంతో దాడి చేసిన సంఘటనను నిరసిస్తూ గురువారం కడప బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్రప్ప నాయుడు మాట్లాడుతూ న్యాయవాది తన విధులను నిర్వర్తించుకొని కోర్టు బయటికి వచ్చిన తరువాత ఆనంద్ అనే వ్యక్తి అత్యంత కిరాతకంగా, పాశవికంగా, సమాజం సిగ్గుపడే విధంగా మారునాయుధంతో దాడి చేయడానికి కడప బార్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కడప బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పి. చంద్రమోహన్, అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : 20వ డివిజన్ విశ్వేశ్వరయ్య సర్కిల్ నుంచి ప్రకాష్ నగర్ వెళ్ళే దారి పాడైపోయి, ప్రయాణ యోగ్యంగా లేకుండా పోయింది. గురువారం నూతన రోడ్డు పనులను టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం కొత్త రోడ్డు కోసం రూ.15 లక్షలు మంజూరు చేయించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లను పట్టించుకున్న పాపాన పోలేదని చెప్పారు. జనవరి నాటికి కనీసం గుంతలు పూడ్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు రంజిత్, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె



బండలాడుగు పోటీలు ప్రారంభిస్తున్న పుత్తానరసింహారెడ్డి

మండల పరిధిలోని స్థానిక ఉటుకూరు ఎస్‌సి కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయంలో సీతా రామ విగ్రహ ప్రతిష్టాపనలో భాగంగా నిర్వహించిన బండ లాగుడు పోటీలను గురువారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు ఆయనను కార్యనిర్వహులు గుర్రాల రెడ్డన్న ఆధ్వర్యంలో పూలు వెదజల్లుతూ బాణాసంచా కాలుస్తూ మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. నూతనంగా ప్రతిష్టించిన సీతారామ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు తీసుకున్నారు. అనంతరం ఓల్డ్ కేటగిరి వృషభరాజములచే బండలాగుడు పోటీలు ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన వృషభరాజా యాజమాన్యులకు మొదటి బహుమతి రూ. 40 వేలు, రెండవ బహుమతిని 30 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాలుగవ బహుమతి రూ.10 వేలు, 5వ బహుమతి రూ. 5 వేలు, ,ఆరవ బహుమతి రూ. 3 వేలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ టి.వి. కృష్ణారెడ్డి, టిడిపి నాయకులు, ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దత్తత గ్రామాలకు వేరుశనగ విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ ఆహార భద్రత మిషన్‌లో భాగంగా మండల పరిధిలోని ఇప్పపెంట, పెండ్లిమర్రి మండలంలోని చెర్లోపల్లె, రామాపురం మండలంలోని నల్లగుట్టపల్లి గ్రామాలకు చెందిన రైతులకు వేరుశనగలో విశిష్ట (టిసిజి ఎస్1694), కదిరి లేపాక్షి(కె 1812) రకాలకు చెందిన విత్తనాలను గురువారం పంపిణీ చేశారు. సందర్భంగా కెవికె సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ కె6 రకం ఆకుమచ్చ తెగులు తట్టుకొని వర్షాధారం కింద నారు నుంచి 105 రోజుల్లో దాదాపు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళా మాట్లాడుతూ కదిరి లేపాక్షి రకం మంచి దిగుబడితో పాటు అధిక నూనె శాతం కల్గి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు సాయి మహేశ్వరి, మానస, డాక్టర్ మహేష్ బాబు, సురేష్ కుమార్ రెడ్డి, గిరీష్ కుమార్ పాల్గొన్నారు.

చైర్మన్‌ను సన్మానించిన చేలో రవి

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా సి. సావిత్రి అడ్వకేట్ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కడప జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి గురువారం విజయవాడలో కార్పొరేషన్ కార్యాలయంలో కలిశారు. శాలువాతో సన్మానించి అభినందన శుభాకాంక్షలు. రజకుల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సి. కృష్ణమూర్తి, యరికలయ్య పాల్గొన్నారు.



చైర్మన్ సావిత్రిని సన్మానిస్తున్న రజక సంఘం నాయకులు

నిందితులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి-కడప అర్బన్ : విశాఖ నగరంలో న్యాయ విద్యార్థినిని ప్రేమ పేరుతో నయవంచన చేసి దారుణంగా అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. ఈ ఘటన నాగరిక ప్రపంచాన్ని సిగ్గుతో తలదించుకునేట్లు చేసిందని తెలిపారు. లా విద్యార్థిని ఈ అమానుషత్వాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలియక ఆత్మహత్యకు సిద్ధపడిరదంటే ప్రభుత్వ, పోలీసు వ్యవస్థ పట్ల నమ్మకం లేని స్థితి కనిపిస్తుందని పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో మూడేళ్ళ చిన్నారిని చిదిమేసిన ఘటన మరువక ముందే ఇలా చోటు చేసుకోవడం దురదృష్టకరమని తెలిపారు. రాష్ట్రంలో రోజూ మహిళలు, పిల్లలపై దాడులు, అత్యాచార ఘటనలు పెరుగుతున్నా పోలీసు వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. నిందితులకు సరైన శిక్షలు పడకపోవడం, జాప్యం వలన మరింత పెట్రేగిపోతున్నారని తెలిపారు. మహిళలు, విద్యార్థులు సంఘటితపడి ఇలాంటి ఆకృత్యాలు పునరావృతం కాకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని తెలిపారు.

మద్యం ఏరులై పారుతోంది : 'రాచమల్లు'

ప్రజాశక్తి - కడప : చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులై పారుతోందని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. మద్యం ఏరులై పారుతున్నప్పుడు ఆడబిడ్డల మెడలో తాళిబొట్టు తెగవా? అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు అందర్నీ మోసం చేసి తన ఖజానాను నింపుకుంటున్నాడని అన్నారు. గురువారం వైసిపి కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు మద్యం ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. జగన్ ప్రభుత్వంలో అధిక ధరలు అన్నారని, నాణ్యత కూడా లేదని చెప్పారని, ఆడపిల్లల మంగళ సూత్రాలు తెంపుతాడు ఇప్పుడు తెగదా అని ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ, చెప్పిన మాటలన్నీ మరిచిపోయారని విమర్శించారు. రూ. 99 మద్యం అన్నారని, ఇప్పుడు ఆ ఛీప్ లిక్కర్ దొరకడం లేదని పేర్కొన్నారు. అదే మందు కేరళలో రూ. 85కి ఇస్తున్నారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వంలో 47వేల బెల్టు షాపులు రద్దు చేస్తే, మళ్లీ వాటిని తెరిచి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని చెప్పారు.

24న రాష్ట్ర స్థాయి చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప : కడప జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24న కడప నగరంలోని బెల్లంమండి వీధిలో ఉన్న ఇంటర్నేషనల్ ఫంక్షన్ ప్యాలెస్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి ఓపెన్ ప్రైస్ మనీ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్ దర్బారి తెలిపారు. ఈ టోర్నమెంటులో మొత్తం రూ.53 వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు, మెడల్స్ అందజేస్తారన్నారు. పాల్గొనే ప్రతి క్రీడాకారునికి సర్టిఫికెట్లు ఇస్తారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి ఓపెన్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంటులో పాల్గొనే క్రీడాకారులందరికి ఉచిత భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షులు వై. సత్యనారాయణ రావు, కార్యదర్శి వై. సుమన్ హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా క్రీడాకారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని టోర్నమెంట్‌లో తమ ప్రతిభను ప్రదర్శించి విజయాన్ని సాధించగలరని విజ్ఞప్తి చేశారు. పూర్తి వివరాలకు 8341255151లో సంప్రదించవచ్చునని కోరారు.

బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె : సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఎంపిడిఒ కుళాయిబాబు పేర్కొన్నారు. గురువారం ఆయన బుగ్గలపల్లి, కొలుములపల్లి గ్రామ సచివాలయాలను సందర్శించారు. సచివాలయ సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్ పనితీరుపై ఆరా తీశారు. సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అందరూ ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలకు, సాయంత్రం 5 గంటలకు తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని ఆదేశించారు. వివిధ పనులపై వచ్చే ప్రజలతో వినయంగా మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఏ సమస్యలైనా వెంటనే పరిష్కరించాలని చెప్పారు. **అట్లూరు:** సచివాల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ భాస్కర్ బాబు అన్నారు. గురువారం మండలంలోని తంబల గొంది కొండూరు, కుంభగిరి గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ అధికారులు నరసింహారెడ్డి, మనోజ్, సుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : విద్యార్థులు లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలని జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఎస్ఎండి తాహిర్ పిలుపునిచ్చారు. గురువారం ఉమెన్స్ త్రైవ్ ఎపి ఆర్గనైజషన్ ఫౌండర్ రషీదా ఆధ్వర్యంలో పలు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ శ్రీనివాసులు, ఎస్.ఎం.డి తాహిర్ మాట్లాడుతూ చిన్న తనం నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరుచుకుని ముందుకు సాగితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని తెలిపారు. విద్యార్థులు పదవ తరగతి తర్వాత జీవితంలో ఎలా స్థిరపడాలి అంశంపై అవగాహన నిర్వహిస్తు న్నామన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఎరుపరచుకుని పట్టుదలతో చదివి విజయం సాధించాలన్నారు. డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కానాలని ఆ కళలు సహకారం అయ్యేంతవరకు నిరంతరం శ్రమించాలన్నారు. కార్యక్రమంలో ఉమెన్స్ ఏపి ఆర్గనైజేషన్ మహేనూర్ ఆయేషా, సుల్తానా, అర్జున్ రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్.ఎం.డి.తాహిర్

నూర్పిడి దశలో నేలకొరిగిన వరిపంట

రైతుల్లో ఆందోళన.. సమస్యను అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వేడుకోలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో కుందూ, పెన్నా పరివాహక గ్రామాలు, బోరుబావుల కింద ఖరీఫ్‌లో సాగుచేసిన వరి పంట నూర్పిడికి సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో గతవారంలో తుపాను ప్రభావంతో వరిపంట నేలకొరిగింది. వారం, పది రోజుల్లో ఈ వరి పంటను నూర్పిడి చేయాల్సి ఉంది. వర్షం వల్ల పంట నేల కొరుగుతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం ఈనెల 23 నుంచి మళ్లీ తుపాను ఉందని వాతావరణ శాఖ ప్రకటన జారీ చేస్తుండడంతో రైతుల్లో ఆందోళన మరింత పెరిగింది. ప్రస్తుతం నేలకొరిగిన వరి పంటను కట్టలు కట్టించాలంటే రైతులు ఆర్థికంగా పెనుభారం. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియక రైతు సతమతమవుతున్నాడు. వారం పది రోజులు పాటు వర్షాలు పడకపోతే పంట నూర్పిడి చేసుకోవచ్చని రైతులు పేర్కొంటున్నారు. వర్షానికి తడిస్తే ధాన్యం దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నేలకొరిగిన వరి పంటను గుర్తించి నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.


చియ్యపాడు వద్ద నేలకొరిగిన వరి పంట

ఘనంగా ఎమ్మెల్యే 'పుట్టా' జన్మదిన వేడుకలు


చాపాడు : వృద్ధులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పల్లవోలు సమీపంలోని కాశినాయన వృద్ధాశ్రమంలో గురువారం టిడిపి నాయకులు బ్రెడ్, పండ్లు, చీరలు పంపిణీ చేశారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా టిడిపి మండలశాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, అల్లాడుపల్లె టిడిపి నాయకులు పెరుగు నారాయణ యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ముందుగా అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మిల్లు శీను, వెంకటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ మేకల బాబు, వీర నారాయణ యాదవ్, కిషోర్‌రెడ్డి, నారాయణరెడ్డి, ప్రభాకర్, హర్షవర్ధన్ రెడ్డి, పోలయ్య, సాయి, కొండపల్లి ఉమాకాంత్ పాల్గొన్నారు. **సిద్ధారెడ్డిపల్లెలో..** చాపాడు మండల పరిధిలోని సిద్ధారెడ్డిపల్లెలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదిన వేడుకలను టిడిపి నాయకులు కామా హరికృష్ణారెడ్డి, వనిపెంట సుబ్బిరెడ్డి, బుచ్చిరెడ్డిగారి ప్రతాపరెడ్డి, డాక్టర్ రాఘవరెడ్డి కేక్ కట్ చేశారు. పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు.

మైదుకూరు (చాపాడు) : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదినం సందర్భంగా మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో టిడిపి నాయకులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అన్న కాంటీన్‌లో పేదలకు టిఫిన్, భోజనం ఉచితంగా ఏర్పాటు చేశారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో భారీ కేక్ కట్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనపాల జగన్, పట్టణ అధ్యక్షులు దాసరి బాబు, మేకల బాబు, మాజీ గ్రంథాలయం చైర్మన్ ఎపి రవీంద్ర, క్లస్టర్ ఇన్‌ఛార్జి పాశం మారుతి, ధనపాల యుగంధర్, రవి, యాపారాల చిన్న, కోన సుబ్బారావు, రేషన్ డీలర్ అసోసియేషన్ అధ్యక్షులు చొక్కం శివ, భూమిరెడ్డి రమణ, నాయకులు పాల్గొన్నారు.

ఖాజీపేట : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా గురువారం టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. పాటిమీదపల్లె ప్రాథమిక పాఠశాలలో మైదుకూరు నియోజకవర్గ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. విద్యార్థులకు ప్రత్యేక అతిథిభోజనం ఏర్పాటు చేశారు. అతిథులుగా భూమాయపల్లె సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య యాదవ్, మండల టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, మిడుతూరు టిడిపి సీనియర్ నాయకులు ఇట్టేం శ్రీరాముల యాదవ్, విద్యుత్ కాంట్రాక్టర్ మిడుతూరు ఏసుపాదం హాజరయ్యారు. కార్యక్రమంలో దాసరి రవిప్రసాద్ యాదవ్, దాసరి బలరాం, గంగరాజు బాల, పిట్టు ప్రతాప్, ఓబులేసు గంగరాజు దిలీప్, రమేష్, సుబ్బరాయుడు పాల్గొన్నారు. **పుల్లూరు పంచాయతీ..** నాగనాథేశ్వర కోనలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా స్వయంభు శివుడికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు, నాయకులు గంగవరం ఆదినారాయణ రెడ్డి, నెల్లూరప్ప యాదవ్, టీడీపీ నాయకులు దాసరి శ్రీనివాసులు యాదవ్, రామసుబ్బయ్య నాయుడు, రమేష్ నాయుడు, కడప రామ చంద్రయ్య, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పల్లె గంగాధర్, బొర్రా సుబ్బారెడ్డి పాల్గొన్నారు. పలువురికి అల్పాహారం ఏర్పాటు చేశారు. **పత్తూరు సచివాలయం వద్ద..** మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదిన కార్యక్రమాన్ని ఉపసర్పంచ్ ముత్తూరు రమణ, నాయకులు సారె పిచ్చినాయుడు, సారే రామనాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదిన వేడుకలు స్థానిక టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ఎల్లటూరు సాంబశివారెడ్డి, పూజ శివయ్య యాదవ్, మల్లెపల్లె సర్పంచ్ భర్త నారాయణ, మేకల సుధాకర్, నారాయణ, బాలా గౌడ్, ధర్మనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

దువ్వూరు : స్థానిక మూడు రోడ్లకూడలిలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదిన వేడుకలను మండల టిడిపి కన్వీనర్ బోరెడ్డి రమణారెడ్డి, దువ్వూరు పట్టణ ఇన్‌ఛార్జి పాపినేని రాంబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కారపురెడ్డి సంజీవరెడ్డి, శెట్టి నాగరాజు, పెచికల పాటీ సుబ్బయ్య, అందే శ్రీనివాసులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని తరలించొద్దు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లను సత్వరమే ఉపసంహరించుకోవాలని సిఐటియు జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు ఏసుదాసు కోరారు. ఆ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎల్ఐసి పక్కన ఉన్న ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం ఎపిజిబి మేనేజర్‌కు, ఆర్‌డిఓ ఆదిమూలం సాయి శ్రీకి వేర్వేరుగా వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ గ్రామీణ ప్రజల ఆర్థిక అభివృద్ధిని కాంక్షించి కేంద్ర ప్రభుత్వం 1976లో ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను ఏర్పాటు చేసిందన్నారు. వ్యాపారం పరంగా, లాభాల్లో, అత్యధిక నిల్వలో దేశంలోనే అగ్రస్థానంలో ఎపిజిబి నిలిచిందన్నారు. కేంద్రప్రభుత్వం ఒక రాష్ట్రం ఒకటే గ్రామీణ బ్యాంకు విధానంతో ఎపిజిబిలో నూతనంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్రవికాస్ గ్రామీణ బ్యాంకులను విలీనం చేస్తున్నారని తెలిపారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయం దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు సెంటర్ పాయింట్ అయిన కడపలో దశాబ్దాల కాలంగా ఉందన్నారు.



ఎపిజిబి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సిఐటియు నాయకులు

వెనుకబడిన రాయలసీమ ప్రాంతం నుండి ఈ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం తరలించవడం వల్ల రాబోయే తరాలకు, ఈ ప్రాంత వాసులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఇది ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వినయ్, రమేష్, పవన్ పాల్గొన్నారు.


భూపేష్‌రెడ్డిని సన్మానిస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళ్లండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రభుత్వ పనితీరును ప్రజలలోకి తీసుకెళ్లాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చదిపిరాల భూపేష్ సుబ్బరామిరెడ్డి సూచించారు. స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో గురువారం నూర్‌బాషా సంఘం నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో ముందుకెళుతున్న విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని తమ దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూర్‌బాషా సంఘం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. అనంతరం ఆ సంఘం నేతలు భూపేష్‌రెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో నూర్‌బాషా సంఘం నేతలు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన మురళీమోహన్

ప్రజాశక్తి - ఖాజీపేట



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని గురువారం మండల వైసిపి కన్వీనర్ దుగ్గిరెడ్డి మురళీమోహన్ రెడ్డి తాడేపల్లిలో కలిశారు. జగన్ నివాసంలో ఆయనను మురిళి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగన్‌ను శాలువాతో సత్కరించారు. రాజకీయ అంశాలకు సంబంధించి చర్చించినట్లు మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని జగన్ సూచించినట్లు తెలిపారు

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. పట్టణ పర్యటనలో భాగంగా గురువారం మనోజ్‌రావు వీధి, శంకర్‌రావు వీధి, కాన్పుల ఆసుపత్రి పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి, పారిశుధ్యంపై చర్యలు తీసుకున్నారు. కాలువలలో పేరుకుపోయిన సిల్ట్‌ను కార్మికులతో తొలగించారు. కాన్పుల ఆసుపత్రి సమీపంలోని అరుణ్ ఐస్‌క్రీం పార్లర్ వద్ద కాలువను ఆక్రమించి మరుగుదొడ్డి పైపును నేరుగా కాలువలోనికి పెట్టడాన్ని తొలగించాలని ఇంటి యజమానిని ఆదేశించారు.


పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున్

కార్యాలయం నిర్మించారు.. మరుగుదొడ్డి మరిచారు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ కార్యాలయాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. కనీస సదుపాయాలు లేకపోవడంతో కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతూ ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని చెన్నముక్కపల్లె పంచాయతీలో నిర్మించిన రైతు భరోసా కేంద్రానికి మరుగుదొడ్డి లేకపోవడంతో సిబ్బంది, కార్యాలయాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


మరుగుదొడ్డిలేని చెన్నముక్కపల్లె రైతు సేవా కేంద్రం

స్వచ్ఛభారత్ మిషన్ కింద మరుగుదొడ్డి నిర్మాణం కలిగి ఉండాలనే కేంద్ర ప్రభుత్వ ఆశయం నీరుగారుతోంది. లక్షల రూపాయలు వెచ్చించి రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసినా మరుగుదొడ్డి నిర్మించకపోవడంతో సమస్యగా మారింది. కార్యాలయంలో పనిచేసే మహిళ ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్ల వినియోగంపై అధికారులు ప్రతిరోజు చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వ కార్యాలయానికే మరుగుదొడ్డి లేకపోవడం, అధికారులు చర్యలు తీసుకోకపోవడం ప్రభుత్వ ఆశయాన్ని నీరుగారుస్తున్నారు. సిబ్బంది, ప్రజల అవసరాలను గుర్తించాలని సూచిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి మరుగుదొడ్డి నిర్మాణం చేపట్టి సమస్య లేకుండా చూడాలని కార్యాలయాలకు వచ్చే రైతులు, సిబ్బంది కోరుతున్నారు.


మినరల్ మిక్సర్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్యులు

వెదురూరులో ఉచిత పశు వైద్య శిబిరం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో ప్రొద్దుటూరు పశువైద్య కళాశాల, స్థానిక పశువైద్యులు మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్య అధికారి పశువుల పాక శుభ్రంగా లేకపోతే గర్భకోశ సమస్యలు వస్తాయని, పోషణ లోపంతో అవి ఇంకా అధికమై రైతులు నష్టపోతారని తెలిపారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ గర్భకోశ సమస్యలతో ఇబ్బంది పడుతున్న 120 పశువులకు, ఇతర జీవాలకు, కోళ్లకు చికిత్సను అందించారు. రైతులకు మినరల్ మిక్చర్, కాల్షియం టానిక్ మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఇందిర, జ్యోతి, విజయ్‌కుమార్, విద్యాసాగర్, సాయికృష్ణ, సాయి గునరంజన్, పశువైద్య సిబ్బంది చలపతి, లక్షినారాయణ, అమర్నాథ్, విష్ణుప్రియ, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు హర్షణీయం

- పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాయలసీమలోని కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1937 నాటి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం రాజధాని, హైకోర్టు ఈ రెండింటిలో ఒకదానిని రాయలసీమలో ఏర్పాటు చేయాలని ఉందన్నారు. దురదృష్టవశాత్తూ రెండు కూడా అమరావతిలోనే ఏర్పాటయ్యాయని తెలిపారు. హైకోర్టు రాకపోయినా హైకోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటు నిర్ణయం అభినందనీయమని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తే రాయలసీమకు హైకోర్టు బెంచ్ తప్పక వస్తుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

ప్రజాశక్తి - వేంపల్లె


ఎస్ఐ రంగారావు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని మండల ప్రజలను ఎస్ఐ రంగారావు కోరారు. ఆ మేరకు గురువారం ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు మోటర్ బైకులు వేసుకొని అతి వేగంగా వెళుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. పాఠశాలకు మోటర్ బైకులో వెళ్లకుండా తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల వాహనాల డ్రైవర్లు, క్లీనర్లు కూడా ఖాకీ డ్రసు వేసుకోవాలని, ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తామన్నారు. దుకాణాల వద్ద బైకులను రోడ్డుపై పెడితే వారిక కూడా జరిమానాలు తప్పవన్నారు. స్కూల్ పిల్లలను పరిమితి సంఖ్యలోనే తీసుకెళ్లాలని ఆటోడ్రైవర్లకు సూచించారు. ఆటోలో వెనుక వైపు వేలాడేలా కూర్చో బెట్టరాదన్నారు. రోడ్డు ప్రమాదాల్లో అత్యధిక భాగం హెల్మెట్ లేకుండా వాహనాన్ని నడపడం వల్లే జరుగుతున్నాయని ఆయన వివరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చట్ట ప్రకారమైన చర్యలు తీసుకొంటామని ఎస్ రంగారావు హెచ్చరించారు.

సభ్యత్వాల నమోదు అభినందనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

సభ్యత్వాలు చేయించుకునేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక క్రిష్టియన్ కాలనీలో గురువారం ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి చింపిరి ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు నిర్వహించారు. కాలనీ వాసులకు సభ్యత్వాన్ని పార్టీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, మీనాక్షి, సూర్య, అరుణ్, వాసు, శివ పాల్గొన్నారు.


పార్టీ సభ్యత్వ నమోదులో ఎస్.రామమునిరెడ్డి

క్రైం కార్నర్

కారు ఢీకొని యువతి మృతి

ప్రజాశక్తి - చాపాడు

కడప-కర్నూలు ప్రధాన రహదారిపై మండల పరిధిలోని ద్వారకా నగరం వద్ద కారు ఢీకొన్న సంఘటనలో యువతి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. ద్వారకా నగరం దళితవాడకు చెందిన మారిగాండ్ల సుమతి (16) గ్రామ సమీపంలోని కేసి కెనాల్ కాలువలో బట్టలు ఉతుక్కునేందుకు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా మైదుకూరు నుంచి ఆళ్లగడ్డ వైపు వెళుతున్న టీఎస్ 07 ఇఎం 9093 నెంబర్‌గల కారు అదుపుతప్పి ఢీ కొని కారు పంట పొలాల్లోకి వెళ్లింది. ఆ సమయంలో బాలికను కారు ఢీకొన్న విషయాన్ని ఎవరూ గమనించలేదు. బాలిక పంట పొలాల్లో పడిపోయింది. డ్రైవర్ గ్రామస్తుల ట్రాక్టర్ సహాయంతో కారును రోడ్డుపైకి తీయించుకున్నాడు. కారు పంట పొలాల్లోకి ఎలా వెళ్లిందని స్థానికులు పరిశీలన చేస్తుండగా సుమతి రక్త గాయాలతో మడుగులో పడి ఉండడాన్ని గమనించారు. అప్పటికే సుమతి మృతి చెందినట్లు గుర్తించారు. సంఘటనతో సుమతి తల్లి ఏడవడం అందరిని కలిచివేసింది. మృతి చెందిన యువతి తండ్రి వెంకట రమణ నెల రోజుల క్రితమే అనారోగ్య కారణంగా చనిపోయాడు. నెల రోజులలోనే తండ్రి, కుమార్తె చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చాపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతి చెందిన సుమతి, (ఇన్‌సెట్) సుమతి (ఫైల్‌ఫోటో)


కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న గుర్రం డేవిడ్‌రాజ్

క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక నడింపల్లిలో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ ప్రహరీని కూల్చిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం డేవిడ్‌రాజ్ డిమాండ్ చేశారు. సంఘటనాస్థలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ పేద విద్యార్థులు హాస్టల్ ప్రహరీని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా కూల్చేశారన్నారు. వీరిపై క్రిమినల్ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేని పక్షంలో వసతి విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఓబులేసు, విద్యార్థులు పాల్గొన్నారు.

దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలను కాపాడండి

- శాసనమండలిలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దాల్మియా సిమెంట్ పరిశ్రమ నుంచి దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలను కాపాడాలని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి కోరారు.



గురువారం శాసనమండలిలో ఆయా గ్రామాలపై ఆయన మాట్లాడుతూ దుగ్గనపల్లి గ్రామం పరిశ్రమకు దగ్గరగా ఉందన్నారు. కేవలం 50 ఎస్సీ కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయని, వర్షాకాలంలో అధికంగా వరదలు సంభవిస్తున్నాయన్నారు. నవాబుపేట, దుగ్గనపల్లి గ్రామ రైతులు సిమెంటు పరిశ్రమ వల్ల సారవంతమైన భూములను పంటలు వేయకుండా ఖాళీగా ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే దుమ్ము, ధూళి ఇతర వ్యర్థాలతో రైతులు, సామాన్యులు నష్టపోతున్నారన్నారు. స్థానిక అధికారులు దాల్మియా వారికి తలొగ్గి తప్పుడు నివేదికలు ఇస్తూ ఆయా గ్రామాల వారిని ఇబ్బందికి గురి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి దుగ్గనపల్లి గ్రామాన్ని సురక్షితమైన ప్రదేశానికి తరలించాలని, 150 ఎకరాల రైతులకు నష్టపరిహారం చెల్లించి, వారికి మరోచోట భూమిని కల్పించాలన్నారు. దాల్మియా మరో ప్లాంటును ఏర్పాటు చేస్తే అది 150 ఎకరాల ప్లేస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ అడిగిన ప్రశ్నకు రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఫ్రెండ్లీ ప్రభుత్వం ఉందన్నారు. దాల్మియా వారితో తాను మాట్లాడానని, సరైన సమాధానం వచ్చిన వెంటనే ప్రభుత్వం ద్వారా విషయం తెలియజేస్తామన్నారు.


రవికుమార్‌ను సన్మానిస్తున్న టిడిపి మైనార్టీ నేతలు

గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎన్నికైన మేదర రవికుమార్‌ను టిడిపి నేతలు సన్మానించారు. స్థానిక గండి రోడ్డులోని తన నివాసంలో ఉన్న రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ డైరెక్టర్ మేదర రవికుమార్‌ను టిడిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్ బాషా (యంగ్ బాయ్), మైనార్టీ నేత డాక్టర్ కరీముల్లా ఆధ్వర్యంలో మైనార్టీ నేతలు సన్మానించారు. టిడిపి కోసం పని చేసినందుకు గుర్తింపుగా సిఎం చంద్రబాబు సామాన్య కార్యకర్త మేదర రవికుమార్‌కు రాష్ట్ర డైరెక్టర్ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందని జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్ బాషా తెలిపారు. గిరిజనుల అభివృద్ధితోపాటు టిడిపి కోసం కూడ పని చేయాలని వారు కోరారు. సన్మాన కార్యక్రమంలో టిడిపి నేతలు పక్కిర్‌పల్లె లాడెన్ బాషా, చంద్ర, మదార్, టోపి పాల్గొన్నారు.



ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పిల్లల ఆరోగ్యం పట్ల పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని వైఎంఆర్ కాలనీ పిహెచ్‌యు వైద్యాధికారి హిమబిందు సూచించారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రాథమిక పాఠశాల పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ తెలియని వయసులో ఉన్న చిన్నపిల్లలు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించే ప్రమాదం ఉందని, ఈ సమయాల్లో అన్ని జాగ్రతలు పెద్దలు తీసుకోవాలన్నారు. పిల్లలకు ప్రతి విషయాన్ని ఓపిగ్గా అర్థమయ్యేరీతిలో చెప్పా లన్నారు. వ్యక్తిగత, పరి సరాల శుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పిం చారు. వార్డు హెల్త్ కార్యదర్శి జ్యోతి 30 మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వ హించారు. కార్యక్రమంలో హెడ్ టీచర్ ఖాసిం, ఉపాధ్యాయులు, సిఓ ఎంవిసుబ్బారెడ్డి, ఆశాలు పిల్లి పుష్పకుమారి, మల్లీశ్వరి విద్యార్థులు పాల్గొన్నారు.